## ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి

చర్ల, ఫిబ్రవరి 28: గురువారం అర్ధరాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఒకవ్యక్తి మృతి చెందగా మరొకవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని దండుపేట గ్రామంలో ఇసుకను అన్‌లోడ్ చేసేందుకు ట్రాక్టర్‌ను రివర్సు చేస్తుండగా అక్కడిడే నిద్రిస్తున్న ఇద్దరు యువకులపై నుంచి ఇసుక ట్రాక్టర్ వెళ్ళడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాకు చెందిన కుంజం షన్ను అక్కడికక్కడే మృతిచెందాడు మరో యువకుడ శ్యామల చెన్ను తీవ్రంగా గాయపడ్డాడు. చెన్నును భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నకిలీ నోట్ల కేసు కొట్టివేత

భద్రాచలం, ఫిబ్రవరి 28: భద్రాచలం టౌన్ పోలీసుస్టేషన్‌లో 2013లో అసలు కరెన్సీ నోట్లకు నకిలీ నోట్లు ఇప్పిస్తానని నమ్మబలికి అసలు నోట్లను రూ.3వేలు తీసుకున్నారని అభియోగంతో ములకలపల్లి అశోక్, కొండసాని రాము, కత్తుల వెంకటేశ్వర్లుపై కేసునమోదు చేశారు. నిందితులకు ప్రముఖ సీనియర్ న్యాయవాది అవులూరి సత్యనారాయణ బాధితుల తరపున వాదనలు వినిపించగా కేసు పూర్వ పరాలు పరిశీలించిన భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ ఈ కేసు విషయంలో ముద్దాయిపై ఎలాంటి నేరం రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటించి కొట్టివేస్తూ తీర్పునిచ్చారు.

## మెకానిక్ హెల్పర్ హత్య

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 28: మణుగూరులో జీఎం ఆఫీస్‌కు వెళ్లే దారిలో ఉన్న కాలువలో వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. మణుగూరు దుర్గా కంపెనీలో మెకానిక్ హెల్పర్‌గా పనిచేస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ది జిల్లా గోహారి గ్రామానికి చెందిన ముని ప్రసాద్ బిష్కర్మ (32) హత్యకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. మణుగూరు సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై మనీషా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు బండరాయితో తలపై కొట్టి హత్య చేసినట్లు తెలుస్తోంది. దుర్గా కంపెనీ సిబ్బందితో మాట్లాడి హత్యకు సంబంధించి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## గోదావరిలో ఇద్దరు యువకులు గల్లంతు

### గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాల వెలికితీత

భద్రాచలం, ఫిబ్రవరి 28: పవిత్ర గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లి లోతు తెలియక ఇద్దరు భక్తులు గల్లంతయ్యారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్, వికారాబాద్‌కు చెందిన పవన్(20), హరిప్రసాద్(18) దైవ దర్శనం కోసం కుటుంబంతో కలిసి భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి వచ్చారు. ఈ క్రమంలో పుణ్యస్నానం ఆచరించేందుకు గోదావరి నదిలోకి దిగి స్నానం చేస్తుండగా లోతు తెలియకపోవడంతో ప్రమాదవశాత్తు ఇద్దరూ మునిగి గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న సీఐ రమేశ్ పోలీసు సిబ్బందితో గోదావరి వద్దకు చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా ఇద్దరి మృతదేహాలు లభ్యం కావడంతో వెలికితీశారు. విగతజీవులుగా పడి ఉన్న మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భద్రాచలం పోలీసులు తెలిపారు.

## ద్విచక్రవాహనం...ఆటో ఢీ-ఒకరు మృతి

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 28: ద్విచక్రవాహనం, ఆటో ఢీ కొని ఒకరు మృతిచెందగా డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మోతే పట్టీనగర్-ఇరవెండి మధ్యలో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అశ్వాపురం గ్రామానికి చెందిన బండ్ల శ్రీనివాసరావు(38) ద్విచక్రవాహనంపై సారపాకలో అత్తింటికి వస్తుండగా సారపాక నుంచి మొండికుంట వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో పల్టీ కొట్టగా ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న శ్రీనివాసరావు వాహనంతో సహా రోడ్డుపక్కన పడి అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా ఆటో డ్రైవర్, ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై రాజేశ్ సిబ్బందిని అక్కడకు పంపడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించా రు. మృతుడికి నాలుగేళ్ల పాప, నెల పాప ఉన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విధులను ఆటంకపరిచిన ముగ్గురిపై కేసు

ములకలపల్లి, ఫిబ్రవరి 28: అటవీ అధికారుల విధులను ఆటంకపరిచిన ముగ్గురిపై శుక్రవారం ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపిన వివరాలు.. కలప నిల్వ చేశారన్న సమాచారంతో ఒడ్డురామవరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ తేజావత్ అనూష, పాల్వంచ బీట్ ఆఫీసర్ లకావత్ సాలి, బేస్ క్యాంప్ వాచర్లు తనిఖీకి వెళ్లా రు. వారిని ఒడ్డురామవరం గ్రామస్తులు భూక్యా నంద, అత ని భార్య హరిత, అక్క సామ్ని అడ్డుకుని దాడి చేశారు. బీట్ ఆఫీసర్ అనూష ఫిర్యాదుతో ఆ ముగ్గురిపై కేసు నమోదైంది.

## ఇసుక లారీ సీజ్

ములకలపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని కంపగూడెం క్రాస్‌రోడ్ వద్ద ఎస్సై కిన్నెర రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసు లు శుక్రవారం వాహనాలను తనిఖీ చేవారు. పాల్వంచ వైపు నుంచి ఇసుక లోడ్‌తో వచ్చిన లారీని ఆపారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదైంది. ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

## ఇసుక స్వాధీనం

పాల్వంచ, ఫిబ్రవరి 28: స్థానిక గొల్లగూడెం చింతలచెరువు లోతట్టు ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు లారీల ఇసుకను శుక్రవారం ఆర్ఐ రవికుమార్‌రెడ్డి స్వాధీనపర్చుకున్నారు. దానిని తహసీల్ కార్యాలయానికి తరలించారు.

## గంజాయి పట్టివేత

పాల్వంచ, ఫిబ్రవరి 28: ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్‌కు బైక్‌పై తరలిస్తున్న గంజాయిని పట్టణ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన అభిరామ్, చంద్రశేఖర్ కలిసి ఛత్తీస్‌గఢ్‌లో గంజాయి కొన్నారు. దానిని బైక్‌పై (టీఎస్ 08 జేఆర్ 0485) తరలిస్తున్నారు. ఎస్సై రాఘవయ్య ఆధ్వర్యంలో పోలీసులకు సంజయ్‌నగర్ వద్ద పట్టుబడ్డారు. వారి నుంచి 7.8 కేజీల గంజాయి, రెండు సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనపర్చుకున్నారు. వారిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు.

## కేంద్ర బడ్జెట్‌పై సదస్సు

ఇల్లెందు, ఫిబ్రవరి 28: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లెందులో సదస్సు జరిగింది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ.. అన్ని వర్గాలకు చెందిన పేదలను కేంద్ర బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. పేదల పొట్టలు కొట్టి, పెద్దల బొజ్జలు నింపిందని విమర్శించారు. ఈ బడ్జెట్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. నాయకులు అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, ఈసం వెంకటమ్మ, సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయి

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 28: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరిక దేహదారుఢ్యం పెంపొందించడమే కాకుండా మానవ సంబంధాలు పెరుగుతాయని న్యాయవాది భజన సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం బూర్గంపహాడ్‌లో మిత్రుడు మణికంఠ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మణికంఠ క్రికెట్ కప్ టోర్నీని ఆయన ప్రారంభించారు. తొలుత మణికంఠ ఆత్మశాంతికి క్రీడాకారులు మౌనం పాటించారు. స్నేహితుని జ్ఞాపకార్థం తొలిసారిగా ఏర్పాటు చేసిన టోర్నమెంట్ విజయవంతంగా సాగాలన్నారు. కార్యక్రమంలో డోనర్స్ శ్రీనివాస్‌యాదవ్, గుండె వెంకన్న, గోనెల ప్రతాప్, అరవింద్, విన్నర్, రన్నర్ ట్రోఫీ దాత కన్నెబోయిన సారధికుమార్, క్రీడాకారులు, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# దర్జీ పనోళ్లం.. దర్జా లేనోళ్లం..

దర్జీ వృత్తికి మూలకారకుడు, ప్రపంచవ్యాప్తంగా లెక్కలేనంతమందికి (దర్జీ) ఉపాధి మార్గం చూపించిన టైలరింగ్ మిషన్ సృష్టికర్త- విలియమ్స్ హవే. ఆయన జయంతి రోజైన శుక్రవారం.. జిల్లావ్యాప్తంగా దర్జీలంతా పండుగ దినంగా జరుపుకున్నారు. మిఠాయిలు పంచుకుని, శుభాకాంక్షలు చెప్పకుని, ప్రదర్శనలు నిర్వహించి సంబురాలు చేసుకున్నారు. అదే సందర్భంలో.. ఆదరణ కోల్పోతున్న తమ వృత్తిని తల్చుకుంటూ, మున్ముందు చేతి నిండా పని ఉంటుందో లేదోనన్న బెంగతో, తమను ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోవడం లేదన్న ఆవేదనతో, ఎప్పటికైనా ఏదో ఒక రూపంలో ఆదుకోకపోతుందా-నన్న ఆశతో.. ఇదిగో ఇన్ని అంశాలను పంచుకున్నారు. ఒకప్పుడు తమ వృత్తికి ఎంత డిమాండ్ ఉండేదోనని జ్ఞప్తి చేసుకుంటూ, ఇప్పుడు ఎంతలా దిగజారిందోనని బాధపడుతూ..
ఇలా నిట్టూర్పు విడిచారు-
'దర్జీ పనోళ్లం.. దర్జా లేనోళ్లం..'

నమస్తే నెట్‌వర్క్.


అన్నపురెడ్డిపల్లి: కేక్ కట్ చేస్తున్న టైలర్లు


అశ్వారావుపేట టౌన్: ప్రదర్శన నిర్వహిస్తున్న టైలర్లు


దమ్మపేట: వేడుక..


ఇల్లెందు: దర్జీలకు సన్మానం


పాల్వంచ: జెండావిష్కరిస్తున్న టైలర్లు


పాల్వంచ: మాట్లాడుతున్న టైలర్ల సంఘం నాయకులు


పాల్వంచ: మాట్లాడుతున్న టైలర్లు

# ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

### లొంగిపోయిన వారిలో చర్లకు చెందిన గుర్రాల విజయ్

### వివరాలు వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ

కామారెడ్డి, ఫిబ్రవరి 28 : జిల్లాలో ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయినట్లు కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ తెలిపారు. శుక్రవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లకు చెందిన గుర్రాల విజయ్‌కుమార్ అలియాస్ ఆకాశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉట్టపల్లి గ్రామానికి చెందిన సోడి బాలకృష్ణ జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. సీపీఐ మావోయిస్టు పార్టీ పతనం అంచున ఉన్నదని, ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఘటనలు చూసి పార్టీలో కొనసాగడం సరికాదని లొంగిపోయారని పేర్కొన్నారు.

**పలు కేసుల్లో కీలక పాత్రధారులు**

విజయ్‌కుమార్ 2022 లో హిడ్మా నాయకత్వంలో సీపీఐ మావోయిస్టు పార్టీలో సభ్యుడిగా చేరి రెండేండ్లు సప్లయ్ టీం మెంబర్‌గా వ్యవహరించి 2024లో టెక్నికల్ టీం మెంబర్‌గా చేరాడని తెలిపారు. 2024 జూన్‌లో సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి, 2024 జూలైలో గుమ్మిగూడ, 2024 సెప్టెంబర్‌లో గుండ్రాజ్ గూడెం వద్ద జరిగిన కాల్పుల్లో తప్పించుకున్నాడని చెప్పారు. 2024 డిసెంబర్‌లో గూడ, 2025 జనవరిలో తంబెల్, మల్లంపేట, ఫిబ్రవరిలో పెద్ద ఉట్టపల్లి వద్ద జరిగిన కాల్పుల్లో వీరి పాత్ర ఉన్నదని వెల్లడించారు. సోడి బాలకృష్ణ 2018 లో చర్ల ఏరియా కమిటీ మిలీషియా మెంబర్‌గా అరుణ్ డీవీసీ ఆధ్వర్యంలో చేరాడని తెలిపారు. 2019లో చర్ల ఏరియా కమిటీ సభ్యుడిగా శారద ఏసీఎస్ ఆధ్వర్యంలో పని చేశాడని పేర్కొన్నారు. 2022-23 లో మణుగూరు ఏరియా కమిటీ ఏసీఎస్ మెంబర్‌గా లొంగిపోయే వరకు పనిచేశాడని తెలిపారు. 2019 ఫిబ్రవరిలో కొండపల్లి ఫైరింగ్, 2020లో కొండపల్లి, పూజారి కాంకే, 2023లో పాలగూడ, కర్రిగుట్ట కాల్పుల్లో పాల్గొన్నాడని చెప్పారు.


వివరాలు వెల్లడిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ

# గిరిజనులకు కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 28 : కొండకోనల్లో నివసించే ఆదివాసీ గిరిజనులకు కార్పొరేట్ స్థాయిలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందజేస్తున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. పగిడేరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. వైద్య సేవల గురించి గిరిజన మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు నాణ్యమైన వైద్యం అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్య శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏటీడీవో అశోక్‌కుమార్, డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బాలాజీ, వైద్యులు నిశాంత్, సాత్విక, సంజీవరావు, విజయ్, రాజశేఖర్, విక్టర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

# 111 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 28: ఫిబ్రవరి నెలలో సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి 111 శాతం ఉత్పత్తిని సాధించడం జరిగిందని ఎస్‌వోటు జీఎం శ్యాంసుందర్ తెలిపారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 11 లక్షల 16 వేల 500 టన్నులకు గాను 12 లక్షల 38 వేల 043 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించామని అన్నారు. ఓబీ తొలగింపులో 14 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 97 శాతం 13,53,000 క్యూబిక్ మీటర్ల తీశామని పేర్కొన్నారు. సమావేశంలో ఏజీఎం డీ.వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ రమేశ్, డీజీఎం వెంకట్రావు, డీజీఎం అనురాధా, శేషగిరి, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌వోటు జీఎం శ్యాంసుందర్

## మిర్చి క్వింటాకు రూ.25వేలు ఇవ్వాలి


కల్లాల్లోని మిర్చి పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 28: మిర్చి క్వింటాకు రూ.25 వేలు మద్దతు ధర నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలో పర్యటించి కల్లాల్లో మిర్చిని పరిశీలించిన ఆయన ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు. ఆరుగాలం కష్టించి అప్పులు తెచ్చి, భార్యల పుస్తెలు, బంగారు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి పంటను పండిస్తే పంట చేతికి వచ్చాక సరైన గిట్టుబాటు ధరలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి రైతుల కష్టాన్ని గుర్తించి పంటకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాండవుల రామనాథం, రాయల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, కందుకూరి నాగేశ్వరరావు, గుంటక కృష్ణ, ప్రతాప్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధిచెబుతారు


సమావేశంలో మాట్లాడుతున్న రావులపల్లి రాంప్రసాద్

చర్ల, ఫిబ్రవరి 28: ఆరుగ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని బీఆర్‌ఎస్ నాయకుడు రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం చర్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలోని ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన డాక్టర్ తెల్లం వెంకట్రావు నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. సమావేశంలో మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, నాయకులు అజీజ్, పంజా రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిధులు ఇవ్వాలని సీఎంకు ఎమ్మెల్యే వినతి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 28: నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వినతిపత్రం ఇచ్చారు. మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆ సందర్భంలోనే సీఎంకు వినతిపత్రం ఇచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే హరిప్రియ పరామర్శ

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 28: మండలంలోని మామిడిగుండాలకు చెందిన నెట్ట నిర్మల సొసైటీ డైరెక్టర్ భర్త ఏసురత్నం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ శుక్రవారం పరామర్శించారు.

## భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

భద్రాచలం, ఫిబ్రవరి 28: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారుచేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.

**అన్నదానానికి వితరణ**

భద్రాచలం, ఫిబ్రవరి 28: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో అన్నదానానికి ఖమ్మం నగరం శ్రీనివాసనగర్‌కు చెందిన మునునూరి రామారావు, విజయకుమారి దంపతులు రూ. 1,00,116లు శుక్రవారం ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేయగా అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత

టేకులపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని బేతంపూడి గ్రామస్తుడు మేడ రమేష్.. పోస్టాఫీస్‌లో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకంలో చేరిన కొన్నాళ్ల తర్వాత ఇటీవల మృతిచెందాడు ఆయన కుటుంబానికి రూ.రెండులక్షల బీమా చెక్కును ఇల్లెందు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చిన్న యాకయ్య శుక్రవారం అందించారు.

## కేఓసీ లారీల అడ్డగింత

టేకులపల్లి, ఫిబ్రవరి 28: కేఓసీ లారీల రాకపోకలతో భరించలేనంత స్థాయిలో దుమ్ము ధూళి వస్తున్నదంటూ మండలంలోని దాస్‌తండా గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు. రోడ్డుకు కర్రలను అడ్డంగా పెట్టి లారీలను అడ్డుకున్నారు.

## మునగ నర్సరీ సందర్శన

అశ్వారావుపేట/సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 28: సత్తుపల్లి మండలం సత్యనారాయణపురంలోని మునగ నర్సరీని జిల్లా ఉద్యానాధికారి జంగా కిషోర్ శుక్రవారం సందర్శించారు. మొక్కల నాణ్యత పరిశీలించారు.

## సైబర్ మోసాలపై అవగాహన

చంద్రుగొండ, ఫిబ్రవరి 28: సైబర్ మోసాలపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఏఎస్సై పాపయ్య శుక్రవారం అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి ఫోన్ కాల్ వచ్చినప్పుడు ఎత్తవని, అపరిచితులు ఎవరైనా ఆధార్ నంబర్, ఓటీపీ, బ్యాంక్ అకౌంట్ న్ంబర్ వంటివి అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాల కోరారు. ఇంటర్‌నెట్‌లో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు.

## గౌడ సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక

దమ్మపేట, ఫిబ్రవరి 28: మండల గౌడ సంక్షేమ సంఘం కమిటీని శుక్రవారం దమ్మపేటలో జరిగిన సమావేశం ఎన్నుకుంది. గౌరవాధ్యక్షుడిగా పానుగంటి రాంబాబు, అధ్యక్షుడిగా యార్లగడ్డ సూరి, ఉపాధ్యక్షులుగా బంధం శ్రీనివాసరావు, చిలకబత్తుల ఏసుబాబు, యార్లగడ్డ కొండలరావు, యార్లగడ్డ మణికంఠ, కార్యదర్శులుగా యార్లగడ్డ ఏసు, పానుగంటి సందీప్, కోశాధికారిగా పానుగంటి కృష్ణ, వీరంకి రమణ, గొల్లపల్లి వెంకటేష్, సింహాద్రి, మరి కొందరు సభ్యులుగా ఎన్నికయ్యారు.

## ఎంపీవోకు సన్మానం

ములకలపల్లి, ఫిబ్రవరి 28: మండల పంచాయతీ అధికారి లక్ష్మయ్య శుక్రవారం ఉద్యోగం విరమించారు. ఆయనను ఎంపీడీవో రేవతి, సిబ్బంది స్థానిక రైతు వేదికలో సన్మానించారు.

## 'అవినీతి అడ్డా'పై నిఘా కన్ను

దమ్మపేట రూరల్, ఫిబ్రవరి 28: 'అవినీతికి అడ్డా... దమ్మపేట తహసీల్' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంతో రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. ఈ కార్యాలయంపై నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. ముష్టిబండ, దమ్మపేట గ్రామాల్లో నిఘా అధికారులు శుక్రవారం పర్యటించినట్లు తెలిసింది.

## బొగ్గు గని కార్మికులకు న్యాయ చైతన్యం

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 28: పీవీకే 5 బొగ్గు గనిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి శుక్రవారం సందర్శించారు. న్యాయ చైతన్య కార్యక్రమం నిర్వహించారు. కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. పారాలీగల్ వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నిరంజన్‌రావు, ఏజెంట్ పీవీకే 5 మైన్ డాక్టర్ ఎంవీఎన్ శ్యాంసుందర్, వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి

పాల్వంచ రూరల్, ఫిబ్రవరి 28: ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ చెప్పారు. మండలంలోని లక్ష్మిదేవిపల్లి (ఎస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపిక చేసిన విద్యార్థులకు 'ఉన్నతి' శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ మాధవి, కెరియర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ అరుణకుమారి, సభ్యులు కోటగిరి రాంబాబు, పోట్లపు శ్రీనివాస్ రమేష్, కామేశ్వరరావు, పారెల్లి శ్రీనివాస్, డాక్టర్ స్వరూపరాణి, ఎన్ శ్రీదేవి, బాబ్జి పాల్గొన్నారు.